నిరుపేదలందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

చిక్కడపల్లి, జనవరి 20 : నిరుపేద లందరినీ రేషన్ కార్డు లబ్ధిదారులుగా గుర్తించి, కార్డులు ఇవ్వాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేటర్.. సర్కిల్-6 అసిస్టెంట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ డి.దీప్తిని కలిసి వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తమ డివిజన్‌లో చాలా మందికి రేషన్ కార్డులు లేవని, అర్హులైనవారందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పలు సవరణలు చేయాలని, వార్షిక ఆదాయాన్ని తగ్గించాలని.. అప్పుడే మరికొంత మంది పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సావిత్రి, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నటసార్వభౌముడు ఎన్‌టీఆర్

కవాడిగూడ, జనవరి 6: వంశీ ఇంటర్నేషనల్ (ఇండియా) ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో ఎన్‌టీఆర్ పాటకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ..విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, దర్శకుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు. 52 యుగళగీతాలతో ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి ఆహూతులను అలరించింది. వంశీ రామరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయకులు వీఆర్‌కే, హృషికేశ్, అనంతలక్ష్మి, శైలజ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాయనీ గాయకులను సత్కరించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేద్దాం

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి : యాంటీ నార్కోటిక్ బ్యూరో డీస్పీలు శివనాయుడు,రమేశ్

మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్ అధికారులు, విద్యార్థులు

డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ రమేశ్

బొల్లారం, జనవరి 20: మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కృషి చేస్తున్నామని యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శివ నాయుడు అన్నారు. మంగళవారం తిరుమలగిరిలోని ఆర్మీ పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల అంశాలపై తెలంగాణ మాదక ద్రవ్యాల నిరోధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శివ నాయుడు, శంకర్ యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలపై వివరించారు. ఇటీవల కాలంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్న నేపథ్యంలో వారిలో అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు మనిషిలోని పరివర్తనను పూర్తిగా నశింపజేసి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని తెలిపారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకై కృషి చేస్తున్నామని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలు వాడొద్దని పోస్టర్లను అతికించారు. ఆర్మీ పబ్లిక్ స్కూల్ కౌన్సిలర్ డాక్టర్ సుధా మేనన్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అర్చన రాయ్, ఉపాధ్యాయ సిబ్బంది, యాంటీ నార్కోటిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడ, జనవరి 20: డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలపై చిన్ననాటి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని.. అప్పుడే సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ ఆర్.రమేశ్ అన్నారు. కవాడిగూడ తాళ్లబస్తీలోని చిత్రాల నర్సింహులు స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సోమవారం గంజాయి, మత్తు పదార్థాలపై పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై ఈ సందర్భంగా లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. అదే విధంగా డ్రగ్స్, గంజాయి తీసుకునే వారిని ట్రైన్‌డ్ డాగ్‌తో గుర్తించే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి విద్యార్థులకు చూపించారు. అనంతరం డీఎస్పీ రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అప్పుడే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని సూచించారు. చెడు దారులకు ఆకర్షితులవకుండా శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలు ఉపయోగించే వారి సమాచారాన్ని 1098 ఫోన్ చేసి చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రాంప్రసాద్, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ జీవన్ రెడ్డి, ముషీరాబాద్ సీఐ రాంబాబు, గాంధీనగర్ ఎస్ఐ నరసింహ, ముషీరాబాద్ డిప్యూటీ ఐఓఎస్ స్వరూపారాణి, కవాడిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, నాగయ్య, సోమయ్య, హేమలత, సౌజన్య, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, రతన్, శ్రీనివాస్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి కుంభ హారతి కలశం..

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారికి షేక్‌పేట్‌కు చెందిన మహేశ్ అనే భక్తుడు కుంభహారతి కలశాన్ని సమర్పించారు. అర కేజీ వెండితో తయారు చేసిన ఈ కుంభ హారతి కలశానికి అమ్మవారి మూలవిరాట్ వద్ద పూజలు నిర్వహించిన అనంతరం దేవాలయ చైర్మన్ కొత్తపల్లి సాయిబాబాగౌడ్, అర్చకులు సతీశ్‌లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బల్కంపేట శ్రీ వీర హనుమాన్ వ్యాయామశాల నిర్వాహకులు బత్తుల రాజేశ్, వనం శ్రీనివాస్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు. – అమీర్‌పేట్, జనవరి 20

ఘనంగా రాగరమ్య సంస్థ 6వ వార్షికోత్సవం

లక్ష్మీ శతకం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రాగ రమ్య, శంకర్ నారాయణ, తదితరులు

చిక్కడపల్లి, జనవరి 20 : శ్రీ రాగరమ్య సంస్థ 6వ వార్షికోత్సవాన్ని సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ పాత్రికేయుడు హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శ్రీ రాగ రమ్య సంస్థ అద్భుతంగా కళా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థ అధ్యక్షురాలు రాగరమ్యను అభినందించారు. ఈ సందర్భంగా హాస్యబ్రహ్మ శంకర్ నారాయణ రచించిన లక్ష్మీ శతకం గ్రంథాన్ని ఆవిష్కరించారు. రాగ రమ్య మట్లాడుతూ.. తమ సంస్థ కళా కేంద్రాలతో పాటు భద్రాచలం, తిరుపతి, శ్రీశైలం, శ్రీ కాళహస్తి, కాణి పాకం వంటి క్షేత్రాల్లో భక్తి కార్యక్రమాలు ప్రదర్శించామని తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులు సంగీత, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సంగీత, నృత్య గురువులు అనిత, శ్రీదేవి, లతారావు, హిర్షిక, పావని ప్రియ, బిందు, అపర్ణ, కృష్ణ ప్రియ, ఉమా లలిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా ప్రశంశాపత్రం అందుకుంటున్న క్రీడాకారుడు జస్వంత్

కవాడిగూడ, జనవరి 20: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల పట్ల దృష్టి సారించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. క్రీడల్లో రాణించి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేసన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ రాష్ట్రం ద్వితీయ స్థానం కైవసం చేసుకున్న సందర్భంగా కోచ్ పులి కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్.. క్రీడాకారులను అభినందించి ప్రశంశాప్రతం అందజేశారు. అనంతరం కోచ్ పులి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకరించిన డీఈఓ రోహినికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ షెడరేషన్ ఆల్ ఇండియా మేనేజర్ డాక్టర్ కె.రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

అఖిల భారత పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో రూపొందిం చిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. మహిళా విభాగం అధ్యక్షురాలు దుష్యంతల, ఉపాధ్యక్షు రాలు పద్మ సూర్య ప్రకాశ్, కోశాధికారి విశ్వరేఖ, తదితరులు పాల్లొన్నారు. – చిక్కడపల్లి, జనవరి 20

వాయు, శబ్ధ కాలుష్యాన్ని నివారించండి

ఖైరతాబాద్ : అపార్ట్‌మెంట్ వాసులను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న వాయు, శబ్ధ కాలుష్యాలను నివారించాలని మై హోం మధుబన్ అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ సభ్యులు వి. పురుషోత్తం రెడ్డి కోరారు. శ్రీనగర్‌కాలనీలోని మై హోం మధుబన్ అపార్ట్‌మెంట్స్‌లో 88 ఫ్లాట్స్ ఉన్నాయని, దీనికి సమీపంలో ఉన్న కమ్మ సంఘం భవనంలో కొంత కాలంగా కిచెన్‌కు సంబంధించిన కాలుష్యంతో కూడుకున్న పొగను అతి తక్కువ ఎత్తు లో పైపుల ద్వారా బయటకు పంపిస్తుండడంతో ఫ్లాట్స్‌లోకి ప్రవేశించి యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికితోడు 325 కేవీ సామర్థ్యం కలిగిన జనరేటర్లు నిరంతరం నడిపించడం వల్ల శబ్ధ కాలుష్యాన్ని భరించలేకపోతున్నామని తెలిపారు.ఈ మేరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేశామన్నారు.

లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను జయప్రదం చేయాలి

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కార్యదర్శి హన్మేశ్

కవాడిగూడ, జనవరి 20 : సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో లెనిన్ శత వర్ధంతి ముగింపు సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేశ్ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించే సెమినార్‌ను మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రంగయ్య ప్రారంభిస్తారన్నారు. లెనిన్ రచించిన ఐదు పుస్తకాలపై ప్రసంగ పాఠాలు ఉంటాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదున్నరవరకు జరిగే ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్‌ఠాకూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.జి.రాంచందర్, సోషలిస్టు ఇనీషియేటివ్ కేంద్ర నాయకులు జి.భార్గవ, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, ప్రముఖ రచయిత సతీశ్‌చందర్‌లు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, వామపక్ష అభిమానులు లెనిన్ శత వర్ధంతి ముగింపు సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలి..

సమావేశంలో మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్ రెడ్డి

చిక్కడపల్లి, జనవరి 20 : బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కు చుట్టూ ఉన్న ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు ఇటీవలే ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారుల నేతృత్వంలో తొలగించడం హర్షణీయంఅని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం సుందరయ్య పార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు రమేశ్ రెడ్డి, సంపత్ రెడ్డి, తెలంగాణ హౌస్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.కిషన్ రావు, సీనియర్ వాకర్ రవికుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మరోసారి ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు ట్రాఫిక్ అధికారులకు, జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. గతంలో ఈ ఆక్రమణల వల్ల తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉండేవని గుర్తు చేశారు. పార్కుకు వచ్చే వాకర్స్‌కు కోసం పార్కింగ్ వసతి కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో వాకర్ కృష్ణ, పలువురు వాకర్స్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

బన్సీలాల్‌పేట్‌లో జరిగిన ఎంఆర్‌పీఎస్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

బన్సీలాల్‌పేట్, జనవరి 19 : ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ చేపట్టిన 'వేల గొంతులు-లక్ష డప్పులు' సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బొర్రా భిక్షపతి మాదిగ కోరారు. ఇందుకోసం ఫిబ్రవరి 1న బన్సీలాల్‌పేట్‌లోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా సన్నాహక సమావేశం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. 30 ఏండ్ల పాటు న్యాయపోరాటం చేశామని, వర్గీకరణ సాధించుకునేందుకు మరోసారి ఉద్యమం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. బన్సీలాల్‌పేట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారావు, అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్, నాయకులు రాజు, సత్యనారాయణ, అరుణ్, విజయ్, శ్రీనివాస్, ప్రభాకర్, కుమార్, సనత్‌నగర్ నియోజకవర్గం మాదిగ హక్కుల, అభివృద్ధి ఐక్యత జేఏసీ కమిటీ నాయకులు ఏసూరి మహేశ్, కేఎం కృష్ణ, బి.మహేశ్, ఎస్‌వై.గిరి, సతీశ్‌లు పాల్గొన్నారు.

టీఎస్ఐఐసీ ఖాళీ స్థలం పరిశీలన

నెహ్రూనగర్‌లో ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్,జనవరి 20: నెహ్రూనగర్‌కాలనీలో ఎన్ఎఫ్‌సీ ప్రహరీకి ఆనుకొని ఉన్న టీఎస్ఐఐసీకి చెందిన ఖాళీస్థలంలో కమ్యూనిటీహాల్, పార్కులను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్ సర్వేనంబర్ 43,44,45లోని ఎన్ఎఫ్‌సీ సంస్థ ప్రహరీకి ఆనుకొని ఉన్న టీఎస్ఐఐసీకి చెందిన ప్రాంతాన్ని ఎంపీ ఈటల పరిశీలించారు. ఇదే స్థలంలో కమ్యూనిటీహాలు, పార్కులను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేకు, స్థానికులకు ఇచ్చిన హామీ మేరకు సదరు స్థలాన్ని ఎంపీ సోమవారం పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ స్థానికుల కోసం ఈ స్థలంలో కమ్యూనిటీహాలు, పార్కులను అభివృద్ధి చేసేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపడుతామనని, సంబంధిత అధికారులతో ఈ విషయంపై మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బేతిసుభాష్ రెడ్డి, కార్పొరేటర్ జే.ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, స్థానికులు భాస్కర్, లక్ష్మీనారాయణ, బాబు,దుర్గయ్య, వాసు, అంజి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్, జనవరి 20 : కుత్బుల్లాపూర్ – గాజులరామారం సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. గాజులరామారం సర్కిల్‌లో 9, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 6 సమస్యలపై ఫిర్యాదులు అందిన్నట్లు డీసీలు తెలిపారు.

ప్రభుత్వ హామీలను వెంటనే అమలు చేయాలి

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుల డిమాండ్

బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

కవాడిగూడ, జనవరి 20 : కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను రేవంత్ సర్కార్ వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు వేముల పల్లి వెంకట్రామయ్య, కె.గోవర్ధన్, జె.వి.చలపతిరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు జి.ఝాన్సీలు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 20న హైదరాబాద్ నగరంలో నిర్వహించే ప్రజాప్రదర్శన, బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. హామీలతో అధికారంలోకి వచ్చి14 నెలలు కావస్తున్నా ఒకటి అర తప్పితే ఏదీ అమలు కాలేదని ఆరోపించారు. రైతులకు చేస్తామన్న రుణమాఫీ ఇంకా సగం మందికి అందలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు ఏమీ అమలుకు నోచుకోలేదన్నారు. కావున ఆరు గ్యారంటీలు, ఏడవ హామీ ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ అమలు కోసం ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

విద్యార్థులతో మాట్లాడుతున్న మార్వాడీ యువ మంచ్ ప్రతినిధులు

బన్సీలాల్‌పేట్, జనవరి 20 : అఖిల భారత మార్వాడీ యువ మంచ్, సికింద్రాబాద్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేశ్ ఎం జైన్ మాట్లాడుతూ.. తమ సంస్థ 41వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టామని అన్నారు. గత ఎనిమిది ఏండ్లుగా తమ సంస్థ ఈ పాఠశాల విద్యార్థులకు చేయూతనందిస్తున్నదని తెలిపారు. సంస్థ కార్యదర్శి పంకజ్ రాథోడ్, కోశాధికారి ప్రదీప్ తివారీ, సభ్యులు నారాయణ్, అశోక్, రాంరాజ్, దినేశ్, రమేశ్, హరీశ్, మంగలరామ్, పాఠశాల హెచ్ఎం స్వరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిలమవుతున్న హౌసింగ్ బోర్డు దుకాణాలను కాపాడాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్

చిక్కడపల్లి, జనవరి 20 : మూతపడ్డ బాగ్‌లింగంపల్లిలోని హౌసింగ్ బోర్డు దుకాణాలు శిథిలమవుతున్నాయని, ఈ దుకాణాలను కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్ కోరారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాగ్‌లింగంపల్లిలో తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన 51 దుకాణాలు 15 ఏండ్ల కిత్రం మూతపడ్డాయని తెలిపారు. ఆ దుకాణాలు ఎవరికీ కేటాయించకుండా పెండింగ్‌లో పెట్టడంతో భవనాల నిర్వహణ లేక పూర్తిగా శిథిలమవుతున్నాయని, కొన్ని ఆక్రమణలకు గురవుతున్నాయని తెలిపారు. హౌసింగ్ బోర్డు దుకాణాలకు కిరాయిదారులకు మధ్య ఏర్పడిన సమస్య కారణంగా దుకాణాలు మూసి వేయబడ్డాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు దశరథ్, నాయకులు కె.రమేశ్, ఆర్.వెంకటేశ్, తదితరలు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై ఉచిత శిక్షణ

సీపీఆర్ పద్ధతిని వివరిస్తున్న డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేశ్వర్ రెడ్డి

బన్సీలాల్‌పేట్, జనవరి 20 : గాంధీ మెడికల్ కాలేజీ ఆలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండవ రోజు జరిగిన ఉచిత సీపీఆర్ శిక్షణా శిబిరానికి రెండు వేల మంది హాజరయ్యారని ఆలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జిఆర్.లింగమూర్తి అన్నారు. గుండెపోటు వచ్చిన సమయంలో ప్రాణాలను కాపాడే సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసిస్టేషన్) చేసే పద్ధతిపై నగర పౌరులకు అవగాహన కల్పించి, ఉచిత శిక్షణ, సర్టిఫికెట్‌లను ఇస్తున్నామని తెలిపారు. అంబులెన్స్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, ఆశ వర్కర్లు, పారిశుధ్య కార్మికులు, సామాజిక సేవకులు, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, వివిధ కాలేజీ ల నుంచి వచ్చిన విద్యార్థులకు రెండో రోజు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లను అందజేశామని చెప్పారు. గ్లోబల్ అలయెన్స్ అధ్యక్షుడు డాక్టర్ రవీందర్ సురకంటి, ప్రతినిధులు డాక్టర్ మహేశ్వర్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ డెన్నిస్ మెకాలే (చికాగో), డాక్టర్ రోహిత్, జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధి నర్సింహమూర్తి, వలంటీర్లు పాల్గొన్నారు.

39 మంది ఇన్‌స్ట్రక్టర్లను విధుల్లోకి తీసుకోవాలి

కవాడిగూడ, జనవరి 20: 39 మంది ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్‌లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విధులు కోల్పోయిన ఇంటిగ్రేటెడ్ కంప్యూటర్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్లు స్రవంతి, పల్లవి, అశ్విని, మురళి, నజీర్, శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఇందిరాపార్కు వద్ద సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ గురుకుల సొసైటీ ఆధ్వర్యంలో 2018లో ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం 103 కొత్త గురుకుల పాఠశాలల్లో కంప్యూటర్ ట్రైనింగ్ కోసం రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపికై ఆరేళ్లుగా సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందిస్తుండగా ఆ శాఖ ఉన్నతాధికారులు అకారణంగా తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఏఒక్క ఉద్యోగికీ ప్రతియేటా ప్రవేశ పరీక్ష ఉండదని, కంప్యూటర్ ట్రైనింగ్ సిబ్బందికే పరీక్ష నిర్వహిస్తూ అన్యాయం చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రవేశ పరీక్షల పేరుతో ఇప్పటివరకు 39 మందిని విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. ఓరియంటేషన్ ప్రోగ్రాం కోసం నవంబర్‌లో మొయినాబాద్‌కు చెందిన ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్‌లను పిలిపించి అర్హత పరీక్ష నిర్వహించడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

అభిలాష కృషి ప్రశంసనీయం

రవీంద్రభారతి, జనవరి 20 : అభిలాష హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్